క్లుప్తంగా

సచివాలయ సేవలపై ప్రజలకు అవగాహన



మనుబోలు : జిల్లాలో సచివాలయ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా సర్వీసెస్ పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని పిడూరు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మండల స్థాయి అధికారులతో కలిసి పిడూరు గ్రామ సచివాలయంలో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పిడూరు గ్రామ సచివాలయ పరిధిలో సర్వీసెస్ రిక్వెస్ట్ క్యాంపెయిన్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్‌లను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఒక్కరోజులోనే సచివాలయం ద్వారా అందజేస్తామన్నారు. దీనికోసం గ్రామంలో రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేయాలని సూచించారు. వలంటీర్లు గ్రామంలో ఎవరికి ఏ సర్టిఫికెట్ అవసరమో గుర్తించి అందుకు అవసరమైన పత్రాలను సేకరించాలన్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి గ్రామంలోనే సిటిజెన్ ఏపీ సేవా ద్వారా సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వనజాక్షి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, కార్యదర్శి కృష్ణవేణి, మాజీ సర్పంచ్ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, గ్రామ పెద్ద తిక్కవరపు వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



పొదలకూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో ఆదివారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను కళాకారులు హాస్యవల్లరి ద్వారా వివరించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణానికి హానికలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని ఊపిరితిత్తులు, కేన్సర్, తదితర వ్యాధులకు కారకాలుగా మారుతుందన్నారు. కాలుష్యం పెరిగితే ప్రాణవాయువు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. భావితరాల మనుగడ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని కోరారు. కళాకారులు విభూతి శివశంకర్, విభూతి శశిరేఖ, యడవల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ జాతర



మనుబోలు: మండలంలోని మడమనూరులో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. గ్రామంలో ఏటా యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా తొలిరోజు గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రెండో రోజు గంగపెట్టెకు పూజలు చేసి యువకులు వీరతాళ్ల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. మూడోరోజైన ఆదివారం మహిళలు బోనాలను తలమీద పెట్టుకుని ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి గంగమ్మకు నైవేద్యాలు సమర్పించడంతో జాతర ముగిసింది.

కోడూరు సాగర తీరంలో సందర్శకుల సందడి

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఓ వైపు వేసవి సెలవులు, మరో వైపు మండుతున్న ఎండల నేపథ్యంలో జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు కోడూరు సాగరతీరానికి చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన వారు గంటల కొద్ది సముద్రంలో మునుగుతూ ఆనందంగా గడుపుతూ సేదతీరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకొని మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, మందిర నిర్వాహకుడు మాలకొండయ్య, కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి రామ్మూర్తి, మందిర సలహాదారు ఎమ్మెల్ఎస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన గాండ్ల కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు కోరారు. నగరంలోని దేవిశెట్టి స్వాములు కల్యాణ మండపంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. పదో తరగతి, సీనియర్ ఇంటర్‌లో జిల్లా స్థాయిలో అధిక మార్కులు సాధించిన గాండ్ల సామాజికవర్గ విద్యార్థులకు గోల్డ్ మెడల్, నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, తదితరాలను దివంగత గ్రోసు గోపాలయ్య పేరిట అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గాండ్ల, తెలికుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను రెండేళ్లుగా అందజేస్తున్నామని వివరించారు. సంక్షేమ సంఘ నేతలు అనంత్, మధుసూదన్, నాగరాజు, సత్యనారాయణ, భవానీప్రియ, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నేడు

నెల్లూరు(బారకాసు): ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు అవగాహన ర్యాలీని సోమవారం ఉదయం 6.30కు నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీలో కలెక్టర్ హరి నారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి

డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. డయల్ యువర్ కమిషనర్‌లో భాగంగా 0861 – 2355678 నంబర్‌కు ఉదయం 9.30 నుంచి 10.30 వరకు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఆఫీసర్ల సంఘ ఎన్నిక



నెల్లూరు(దర్గామిట్ట): ఆయుష్మాన్ భారత్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ ఎన్నికలను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఎన్జీఓ భవన్‌లో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నందిమండలం ఆంజనేయవర్మ, నగరాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ పర్యవేక్షణలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా చైర్‌పర్సన్‌గా రెబెకా, కో చైర్‌పర్సన్‌గా సుమాంజలి జ్యోతి మౌనిక, జిల్లా కన్వీనర్‌గా చంద్రమౌళి, తదితరులు ఎన్నికయ్యారు. ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రామారావు, భాను, మహేష్, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల పంపిణీ



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక 17వ విడత ఉచిత మందుల పంపిణీ కార్యక్రమాన్ని బాలాజీ నగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని పేదలకు రూ.50 వేల విలువజేసే మందులను ప్రతి నెలా అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలను తెలియజేశారు.

స్విమ్మింగ్ జట్ల ఎంపిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్విమ్మింగ్ సీనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేశామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, సనత్ తెలిపారు. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

నెల్లూరు సిటీ : ఆర్టీసీ నెల్లూరు జోన్ – 3 పరిధిలోని ఐదు జిల్లాల్లో 14 ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల పాటు వ్యాపార నిమిత్తం అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు ఈ నెల 7, 8వ తేదీల్లో టెండర్ ఫారాలను ఈడీ కార్యాలయంలో ఉండే టెండర్ బాక్సుల్లో వేయాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదామ్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు టెండర్ ఫారాలను వేయాలని సూచించారు. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఉలవపాడులో ఉన్న ఖాళీ స్థలాలకు టెండర్లను నిర్వహిస్తున్నామని చెప్పారు.

దేవాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



నెల్లూరు(బృందావనం): ఉన్నత విద్యను అభ్యసించి దేవాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతానికిపైగా మార్కులు సాధించిన 56 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. సంఘ రాష్ట్ర, జిల్లా నేతలు మధిర ఈశ్వర్, పముజుల నాగేశ్వరరావు, సజ్జా సతీష్ పడాల చంద్రమోహన్ వెంకటసురేష్, శంకరయ్య, అజయ్‌కుమార్, నరేంద్ర, నరసింహస్వామి, మాధవయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఎన్నెమ్మెమ్మెస్ ఫలితాలు

నెల్లూరు (టౌన్) : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్నెమ్మెమ్మెస్) ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో ఉన్నాయని డీఈఓ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www.bse.ap.gov.in లేదా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకోవచ్చని వివరించారు. మెరిట్ కార్డులు త్వరలో విద్యాశాఖ కార్యాలయానికి వస్తాయని చెప్పారు. విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంక్‌లో సేవింగ్స్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకొని తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్ నంబర్‌ను మాత్రమే అకౌంట్‌కు జత చేయాలని సూచించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బృందావనం): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఎంపీకి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వివిధ దేవస్థానాలు ఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నెల్లూరు(అర్బన్): నగరంలోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో గల సన్ క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ సుప్రజారెడ్డి ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి, అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి మందులను అందజేశారు. దాదాపు 150 మందికి వైద్యసేవలను అందించామని ఆమె తెలిపారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక కార్యదర్శి శేషగిరీశం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విజయనగరం సంగీత, నృత్య కళాశాల విశ్రాంత సంగీత అధ్యాపకుడు నారాయణను సుస్వర సంగీత విశారద బిరుదుతో సత్కరించారు. హరినారాయణరెడ్డి, బలరామయ్యనాయుడు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

- ఆదిత్యనగర్‌లోని ఎస్పీబీ పార్కులో బాలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు, రాజేంద్రకుమార్, మురళీమోహన్‌రావు, ఆదిశేషు, సుబ్బరాయుడు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కొమ్మలపూడి జూనియర్స్

మనుబోలు: మండలంలోని కుడితిపల్లిలో నిర్వహించిన కాకాణి రమణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కొమ్మలపూడి జూనియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో కుడితిపల్లి జట్టుపై కొమ్మలపూడి జూనియర్స్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన రూ.15వేల నగదు బహుమతి, కప్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. రన్నరప్ జట్టుకు కుడితిపల్లికి చెందిన కంటి మురళి, రవి కలిసి రూ.10వేల నగదు బహుమతి, కప్‌ను అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకుడు ఆవుల తులసీరాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి, గుంజి రమేష్, సునీల్, మధు, ఆది, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫైనల్స్

తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో కొత్త కాలువ యంగ్ ఫైడర్స్ జట్టు విజేతగా నిలిచింది. విద్యాఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల 15న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. 20 రోజుల పాటు సాగిన టోర్నమెంట్‌లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 42 జట్లు తలపడ్డాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విద్యా ఫౌండేషన్ జట్టుపై కొత్త కాలువ యంగ్ ఫైడర్స్ జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. తృతీయ స్థానం కోసం జరిగిన పోటీలో డక్కులవారిపాళెం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ఎస్సై జంపాని కుమార్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన కొత్త కాలువ యంగ్ ఫైడర్స్ జట్టుకు రూ.50వేలు, రన్నర్‌గా నిలిచిన విద్యా ఫౌండేషన్ జట్టుకు రూ.40వేలు, తృతీయ స్థానంలో నిలిచిన డక్కులవారిపాళెం జట్టుకు రూ.30వేలు నగదు బహుమతులతో పాటు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై జంపాని కుమార్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. యువత క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తూ టోర్నమెంట్ విజేతకు రూ.50 వేలునగదు బహుమతిని అందజేసిన కేఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ అధినేత వేలూరు కళ్యాణ్‌రెడ్డిని అభినందించారు. విద్యాఫౌండేషన్ అధినేత శ్రీపతి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి



సంగీత, నృత్య పాఠశాలలో..



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..



అరవింద్‌నగర్‌లో..

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ జ్యోతిర్మయి నివాళులర్పించారు. అధ్యాపకులు సాయిబాబు, పినాకపాణి, మల్లికార్జునరావు, తిరుపతమ్మ, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

- అరవింద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ ప్రాంగణంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. జూనియర్ బాలు బిరుదాంకితుడు ఇందుశేఖర్‌ను సత్కరించారు. ఔత్సాహిక గాయకులు, హైదరాబాద్‌కు చెందిన గాయకుడు ప్రవీణ్ ఆలపించిన బాలు మధురగీతాలు అలరించాయి. లతీఫ్ కుట్టి, డాక్టర్ సుధాకర్, శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, జయలక్ష్మి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి నివాళులర్పించారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. సిబ్బంది గిరిజ, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అసోసియేషన్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌ను జిల్లాలో బలోపేతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రవికుమార్ పేర్కొన్నారు. డీసీసీబీల్లో నూతన సర్వీస్ నిబంధనలపై ఉద్యోగులకు అవగాహన సదస్సును గాంధీబొమ్మ సమీపంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌లో ఆదివారం నిర్వహించారు. నూతన సర్వీస్ రెగ్యులేషన్స్, ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల పాలసీలు, తదితరాలను వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర అడ్వైజర్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, నేతలు సుమన్, దయాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, శ్రీధర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని కాపు హెల్పింగ్ క్లబ్ కన్వీనర్ కమతం సుబ్బారావు పేర్కొన్నారు. నగరంలోని కాపు భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన దాదాపు 38 మంది కాపువిద్యార్థులకు రూ.1.06 లక్షల మేర ప్రోత్సాహకాలను అందజేశారు. విశ్రాంత తహసీల్దార్ ప్రసాద్, నేతలు జానకిరామ్, శ్రీనివాస్, మల్లి, విజయ్‌కుమార్, రవి, లీలామాధవ్, ప్రసాద్, అనిల్‌కుమార్, నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ పరిపాలన కార్యదర్శుల సమావేశం



నెల్లూరు(అర్బన్): కార్పొరేషన్ పరిధిలో సచివాలయ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని సచివాలయాల అసోసియేషన్ నేత సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సచివాలయ పరిపాలన కార్యదర్శుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ పటిష్టతకు ఉద్యోగులు పునరంకితం కావాలని సూచించారు. నేతలు బాలరాజు, పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలకంటి సేవలు చిరస్మరణీయం



రాఘవయ్య విగ్రహానికి నివాళులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య సేవలు చిరస్మరణీయమని యానాదుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య పేర్కొన్నారు. వెన్నెలకంటి రాఘవయ్య జయంతిని పురస్కరించుకొని నక్కలోళ్ల సెంటర్ సమీపంలోని రాఘవయ్య భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యానాదుల సంక్షేమ సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు ఉషా, శ్రీనివాసరావు, శీను, మురళి, నారాయణ, పెంచలప్రసాద్, కేశవరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగం పెరియాశ్రమ పీఠాధిపతి రాక



నెల్లూరు(బృందావనం): శ్రీరంగం పెరియాశ్రమ పీఠాధిపతి ఆండవన్ వరాహ మహాదేశికన్ నెల్లూరు విచ్చేశారు. రంగనాయకులపేటలోని ఆండాశ్రమ శాఖ సన్నిధిలో భగవత్ పీఠ కైంకర్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గోపురంవీధిలోని వేదాంత దేశికర్ దేవస్థాన ఆధ్వర్యంలో పీఠాధిపతిని ఆహ్వానించారు. తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, వేదాంత దేశికర్ దేవస్థాన మేనేజింగ్ ట్రస్టీ వరదరాజన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడాన్ని అలవర్చుకోవాలి

నెల్లూరు(టౌన్): చిన్నతనం నుంచే మొక్కలు నాటడాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఎంజీబీ మాల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని సాయి మిలీనియం స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కరస్పాండెంట్ అజిత, తదితరులు పాల్గొన్నారు.